


ముసలితనంలో ఈకోరిక ఎందుకు పుట్టిందో తెలియదు. కోరికఏనాటికీ తీరేదికాదు. అయినా ఆకోరికను చంపు కోలేక పోతూ న్నాను.నామాటలు విని కొందరు నన్ను పిచ్చాడని కూడ అనుకొన్నారు. ఎవరూ బయటపడరు కాని అందరూ లోపల లోపల అలాగే అనుకొని ఉంటారు.

కాని కొందరికి మాత్రం ముఖ్యంగా సహృదయులకి నన్ను సిజాలివేసి ఉండవచ్చు.

ఇంతకీ నా కోరిక ....

తెరిపి వెన్నెల తాగాలని కాదు.

మృతపు కూడు తినాలనీ కాదు.

వరూధిని ఒడిలో పవళించాలని కాదు.

విశ్వాధినేత నై వినువీధి కెక్కాలనీ కాదు.

అసలు నాకేం తక్కువయిందని ....

పెద్ద డిగ్రీ ఉంది. కాని దాని మీద ఏమాత్రము అపేక్షలేదు నిజానికి డిగ్రీ తరువాతే నేను బాగా చదివింది. అసలు విజ్ఞానానికి గిరి ఎక్కడ ఉంది?

పిడివాదులకి తప్ప.

ఏది చదివినా ఎంత చదివినా మనసుపెట్టి చదివితే అంత ఆస క్తిగానేఉంటుంది. చదువుతూ పోయేకొద్దీ తెలుస్తుంది.... మన మెంత అల్పులమో!.

ఒకచోట ఏదో శిలావిగ్రహం దొరికితే దాన్ని గురించి పలువురు పలువిధాలుగా రాస్తారు. కొందరైతే శిలావిగ్రహం దొరికినమాట నిజమేనా? అన్నప్రశ్నతో మొదలు పెడతారు. మానవస్వభావం అంత వైవిధ్యంతో కూడి ఉంటుంది.

ఇంత చిన్నవిషయానికే తలలు కొట్టు కొనేవాళ్ళు దేవునిఉనికి, జన్మ,మరణం, తరువాత గమనం గురించి ఇక సిగపట్లు పట్టుకో కుండా ఉంటారా?

ఇదంతా తమాషాగాక్షిచూసేవాళ్లుంటారు. మనకుమల్లే మనలో కలసిపోయి ఏదో ఒకపని చేసుకుంటూనే ఉంటారు. అన్నీవింటారు, చర్చిస్తారు. కాని దేన్నీ నమ్మరు. ఇలాంటి వాళ్లని ఏమనాలో;

కొందరైతే మరీ విచిత్రం ఇలాంటివారినే అవధూతలని అంటారు కాబోలు!

అమీబా మానసిక ప్రవర్తనకు ఆదమ్ మానసిక ప్రవర్తనకు వీరిదృష్టిలో తేడా ఉండదు. అందమైన అమ్మాయిని ఎలా అయితే చూస్తారో వీరు కోతిపిల్లను కూడా అలాగే చూస్తారు. అయిదు చుక్కల పరుపుల సుఖం పెంటకుప్పల ప్రక్కన వీరు అనుభవిస్తారు. అన్నింటికీ అతీతంగా ఉంటారు. అసలు లేశమాత్రమైనా అర్థం కారు!

చాలమంది ఏదో ఒక మార్గాన్ని ఎన్నుకొంటారు. లేదా నమ్ము కొంటారు. సంప్రదాయమనండి, ఇంకేమైన- అనండి దానికే అతుక్కుపోతారు. ఇలాంటివారే చాల ఎక్కువగా ఉంటారు.

ఇదంతా అనుకొంటూ ఉంటే అందరూ నటులేనన్న విషయం స్పష్టమవుతుంది, ఇతరులకు హానిచేయకుండా ఎంతనటిస్తే ఏం నష్టంలేదు. కాని కొందరు దొంగవేధషలు ఉంటారు. చెప్పేదొకటి... చేసేదొకటి! దీన్నే హిపోక్రసీ అనవచ్చు. నేడు చాలమంది ఇలాంటివారే!

కొందరెందుకిలా తయారవుతారు, కొందరెందుకు ఉత్తములై హారతులందుకొంటారని అనుకొంటే....

సంస్కారం గుర్తుకువస్తుంది. దానికికారణం జన్మాంతర పుణ్యఫలం !?

జన్మ.... అసలు ఉందా? లేకపోతే నేనెలావచ్చాను? మానాన్న గారు ఎక్కడికెళ్ళారు? ....

నాన్నగారిని తలుచుకొంటేనే పిచ్చిఏడుపొస్తుంది. చనిపోయి పన్నెండుసంవత్సరాలు పైబడినా ఇంకా మరపుకురాని నాన్నరూపం !

అంతా అబద్ధం! కాలం గాయాన్ని మాన్పుతుందని చెప్పేదంతా అబద్ధం!

నాదుఃఖం పెరుగుతోందే కాని తగ్గించడం లేదే ?

చిన్నతనంలో నాకు నాన్నగారు రోజూ ముద్దిచ్చి చాకొలెట్ ఇచ్చేవారు. దానితీపి తలుచుకొంటే ఇప్పటికి నోరూరుతుంది !

గుర్రం తీసుకురాలేదని కోప్పడితే "నేనే నీగుర్రం కన్నా!" అంటూనాన్న నాగుర్రమైనప్పుడు.... ఆస్వారీ.... ఇంకా నాన్న మెడ పట్టుకొన్నట్లే ఉంది.

బాబూ! నేవెళ్లిపోతున్నానురా! బాధపడకు. ఇలాపోవడం,రావడం అంతా మామూలే: కాని చాల చిత్రమనిపిస్తుంది. అంతే! నేను ఎక్కడో ఒకచోట ఏదోఒక విధంగా నీకు కనిపిస్తాను. ప్రతిమనిషిలో నన్ను చూడటానికి నేర్చుకోనాన్నా!...."

నాన్నమాటలు వినలేకపోయాను. నేనేం అప్పుడు చంటిపిల్లవాణ్ణి కాను.మూడుపదులు నిండిన వాణ్ణి!

అయినా ఏడుపు ఆగలేదు.

పెద్దా, చిన్నా ఏమిటి అనుబంధానికి?

"ఒంటరిగానే పోరాడాలి బాబూ! నేను ఒంటరిగానే వచ్చాను ఒంటరిగానే పోతున్నాను! ఒంటరితనం ఎన్నో విషయాలని నేర్పుతుంది. ఏకాంతంలో ఆసాంతం మునగ గలిగితే నీవెన్నో గ్రహించగలుగు తావు. ..."

నాన్న ఆయాసంగా అంటున్నారు.

కళ్లనిండా నీళ్లు నిండాయి నాకు!

గుండెను ఎవరో పట్టి నట్లుంది!

నాన్న నవ్వారు. నవ్వుతూనే

"కిషన్!అకేలాఛలో ఛఛ!నాకోసంఏడవకునాన్నా! నేనెక్కడికి పోతాను. మళ్లీ నీ కడుపులోనే పుడతాను తండ్రీ! ..."

నాన్నేనా ఇలా మాట్లాడుతున్నది. ఆశ్చర్యం వేసింది. నాకు కర్మకాండలు చేయించవద్దని వీలులో కూడా రాసి పెట్టిన నాన్న ఇలా మాట్లాడడం....

దేనిమీద నమ్మకం లేని నాన్నకు మళ్లీ పుట్టడం మీద, అదీ నా కడుపులో...

తడి! ఆర్ద్రత: అర్థంకాని ఆరాటం! ఊహకందని ఉద్వేగం! నాన్న క్షణాలలోనే ప్రాణాలు విడిచిపెట్టారు.

ఆ ప్రాణాలే నా పంచ ప్రాణాలు! ఏవీ ?

ఇంకెక్కడ?

నాన్న! నాన్న! నాన్న! నాన్న!

అర్ధరాత్రి దాటినా నిద్రరాదు. ఆలోచనలు ఆయాసం తెస్తున్నాయి. ఎంతవయస్సొచ్చినా అణగారిపోని ఈ అనుభవం రాచ పుండులా ఒకవైపు బాధపెడుతూనే మరోవైపు అమ్మఒడిలో గుండెను ఓలలాడ్చినట్లు ఊచేది. అంతా అర్థంకాని విచిత్రధృతి !

అంతుబట్టని, భావ, ప్రకృతి!

సైకోకైనెటిక్స్ అని, సైకోట్రానిక్స్ అని ఏవేవో మాట్లాడు తారు. నాకు తెలిసీ అవంతా ఊరికే చర్చలకోసమే ! సైకాలజీలో మనస్సును పడతారా ? సైకోట్రానిక్స్‌లో ఆత్మను నిలుపుతారా ?

ఒక్కమాటలో నామటుకు అంతా ట్రాష్ !

లేకపోతే ఏమిటి....

ఈ యాభై ఏళ్ల వయస్సులో చనిపోయిన మా నాన్నగారిని చూడాలని ఉంది—అంటే—ఏవేవో మాట్లాడుతారు వీళ్లు.

ఏమీ తెలియకుండా ఏదో ఉన్నట్లు భావించి ఏవేవో పరిష్కా రాలు చూపిస్తారు.

నా డబ్బుకోసం వైద్యం చేసే వాళ్లు కొందరు..........నానుంచి ఏదో ఆశించి నేచెప్పేదానికంతా తలఊపే గంగిరెద్దులు కొందరు.

మనసులో ఏదో పెట్టుకొని ఎప్పుడు దెబ్బకొడతామా అని చిరునవ్వులు నవ్వేవాళ్లు కొందరు....

నా ఎదుటైనా పడకుండా నాకు మేలు కలగాలని కోరుకునే మంచివాళ్లు కొందరు.

ఇలా రకరకాల మనుష్యుల మధ్య బ్రతకడమే గొప్పవిషయం అంత గొప్పవాళ్లమని భావించుకొని ఒక చిన్న సెంటిమెంటుకు లోబడిపోవడం మరీ విచిత్రం !

నా బాబు నా భుజాలమీద ఎక్కినప్పుడు నాకు నాన్న గుర్తొ చ్చాడు. నేను బాబుకి చాకొలెట్ తినిపిస్తూ కథ చెబుతుంటే నాన్న నవ్వినట్లు అన్పించింది. బాబును చూసినప్పు డెల్లా నాన్నను చూడాలని పించేది. నాన్నను తలచుకొన్నప్పుడెల్లా బాబును చూడాలనిపించేది.

ఈవ్యవహారం నాపై బాగా ప్రభావాన్ని చూపింది. బాబు.... నాన్న. నాన్న....బాబు నాన్న....నాన్న నాన్న...నాన్న....

నాన్నను వెంటనే చూడాలని...మాట్లాడాలని... ఇంకా....! కాని ఎలా చూడడం ?

ఏమి కోరిక ? పిచ్చికాని పట్టలేదుకదా ?

చనిపోతే...నాన్నను చూడవచ్చేమో ! నిజమా ?

ఆత్మహత్యే ఈ సమస్యకు పరిష్కారమా ? అవునా ! అవును. ఆత్మహత్యే చేసుకోవాలి.

ఇంత చదువు, ఆస్తి, అందం, అధికారం, కీర్తి ప్రతిష్ఠ అంతా వదలిపెట్టి ఆత్మహత్య చేసుకోవడమా ?

అవును. నాన్నను చూచినప్పుడు కలిగే అరక్షణం పాటి ఆనందం ముందు ఇవంతా ఏపాటి ?

ఆక్షణం ...తరువాత క్షణం...ఆపై క్షణం నాన్నే ! నాన్న రూపమే ! అంతా నాన్న మయం ! బాబు గుర్తుకురాలేదు. అమ్మ గుర్తుకు రాలేదు. భార్య గుర్తుకు రాలేదు. కంపెనీ వర్కర్లు ఎవరూ అక్కర్లేదు. గుప్పెడు నిద్ర మాత్రలు...

గ్లాసెడు నీళ్లు !

గుటగుటమని శబ్దం...

గొంతులో బాధదిగిన అనుభూతి !

గుండెలపైన చెయ్యి.

కడుపులో హాలాహలం.

ఒళ్లంతా చెమటలు.

ఛాతీలో విపరీతమైన నెప్పి.

ఆయాసం ! దగ్గుకూడా రావడంలేదు.

నీరసం ! రగ్గుకూడా కప్పుకోవడానికి చేతకావడంలేదు.

నాన్నరూపం లీలగా ! దగ్గరగా వచ్చింది,

నన్ను తట్టి లేపింది. కళ్లనలుపు కొన్నాను.

బాబు ! నా బాబు !

"నాన్న' భయం వేస్తోంది. పాస్ కెళ్లాలి తోడురావా ?....

ఆ ప్రశ్నతో కాని నాకు తెలివిరాలేదు !

ఇదంతా....ఆపైన ఆలోచించలేదు.

వెంటనే బాబును చూచి అచ్చు నాన్నగారిలా అన్నాను.

"నో ! ఐ డోన్టకమ్. యూగో అలోన్ !...........".

# కైత కన్నె

## శ్రీ చిలుకూరి మధుసూదన రావు

కైత కన్నెకేం తెలుసు
కొత్త పొత్తాల చిత్తాలు ?
అక్కరాల పూలు ముడిచి
చెక్కిలంత కెంజాయ
చిక్కని భావాలు మొలిచి
గుండె, అంచు తీరాల
చిందేస్తూ పరుగెత్తే
కైత కన్నెకేం తెలుసు
కొత్త పొత్తాల చిత్తాలు ?

పొత్తాల ఒత్తుగా పొదిగి
చదువరుల ఎదలో ఒదిగి
భావమై, తరగని రావమై
అన్ని భావాల ఉన్నిరంగు
వలువల వెల్లువ
రూపాన మదిని రాపాడే
కైత కన్నెకేం తెలుసు
కొత్త పొత్తాల చిత్తాలు ?